దంచికొట్టింది

వేములవాడ రూరల్: భారీ వర్షంతో వట్టెంలలోని ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

- జిల్లా వ్యాప్తంగా వర్షం
- చెరువులు, చెక్‌డ్యామ్‌లకు జలకళ

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రెండు రోజులుగా జిల్లాలో వర్షం దంచికొడుతున్నది. సోమవారం మధ్యాహ్నం పలు మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఎల్లారెడ్డిపేట మండలంలో అరగంటకు పైగా కురిసింది. భారీ వర్షాలతో చెక్‌డ్యామ్‌లు, చెరువులకు జలకళ సంతరించుకున్నది. నిమ్మపల్లి చెరువు మత్తడి దుంకుతున్నది. శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి వేములవాడ మూలవాగు, సిరిసిల్ల మానేరు వాగుల నుంచి 260 క్యూసెక్కులు, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి 3,150 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రస్తుతం ఎస్సారార్ ప్రాజెక్టు 16 టీఎంసీల సామర్థ్యానికి చేరుకున్నది. ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టులోకి 3,200 క్యూసెక్కులు వస్తున్నట్లు చెప్పారు.

ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

వేములవాడ రూరల్/రుద్రంగి/బోయినపల్లి/కోనరావుపేట, ఆగస్టు19: పలు గ్రామాల్లో ఎండ, వడగాలులతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సోమవారం సాయంత్రం భారీ వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. రుద్రంగి మండల కేంద్రంతోపాటు బడితండా గ్రామంలో భారీ వర్షం కురిసింది. బోయినపల్లి మండలంలో దాదాపు గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడింది. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో మామిండ్ల వద్ద వరద రాగా, బోయినపల్లి–కొదురుపాక వెళ్లే దారిలో బోయినపల్లి కల్వర్టు వద్ద వరద రావడంతో అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్, నమిలిగుండుపల్లి, నూకలమర్రి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వట్టెంలలో ఓ ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. కోనరావుపేట మండల వ్యాప్తంగా కురిసిన వర్షంతో పత్తి చేనులో వర్షపు నీరు నిలిచింది. దీంతో చేను పూర్తిగా ఎర్రబారిపోవడంతో కలుపు మొక్కలు పెరిగిపోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాజన్నకు శ్రావణ శోభ

రాజన్న ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్ ఆగస్టు 19: శ్రావణ మాసం.. అందులో శివుడికి అత్యంత ప్రీతికరమైన సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. తర్వాత క్యూలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను 25వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, సుమారు రూ.23లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. రాజన్న అనుబంధ దేవాలయాల్లో కూడా రద్దీ నెలకొన్నది. అలాగే స్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వదించగా, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు రాజన్‌బాబు వారికి స్వామివారి శేషవస్త్రం కప్పి ప్రసాదం అందజేశారు.

వైభవంగా మహాలింగార్చన

శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో రాత్రి మహాలింగార్చన కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకుడు నమిలకొండ ఉమేశ్ ఆధ్వర్యంలో అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు 365 లింగాలను, 15 ఆవరణాల్లో చేర్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

అర్జీలు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఆగస్టు19: నిర్ణీత గడువులోగా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టకుండా, గడువులోగా పరిష్కరించాలన్నారు. రాఖీపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రజావాణి వెలవెలబోయింది.

సౌదీఅరేబియాలో షార్ట్‌సర్క్యూట్

- కిష్టంపేటలో కలకలం

చందుర్తి, ఆగస్టు19: సౌదీ అరేబియాలోని ధమామ్ ఏరియాలో ఆల్‌జమాల్ కంపెనీ క్యాంప్ ఆఫీస్‌లో రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. క్యాంప్‌లో వంద మందికి పైగా ప్రవాసీలు ఉండగా, జిల్లాకు చెందిన పలువురు నిరాశ్రయులైనట్లు సమాచారం. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి తిరుపతి, భూమాండ్ల ప్రశాంత్, కొల్లూరి కమలాకర్, అంబేరి దేవరావ్, అబ్దుల్లా, మహ్మద్ అసిఫ్‌కు చెందిన సామగ్రి కాలిపోయినట్టు తెలిసింది. ప్రమాదం జరిగిన ప్పుడు వారంతా డ్యుటీలో ఉన్నట్టు సమాచారం. అగ్ని ప్రమాదం జరిగిన ఘటన తెలియడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం పొన్నం అజయ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 19: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ డీజీఎం పొన్నం అజయ్ పిలుపునిచ్చారు. బీఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ సెంటర్ సేవలను ఆదివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు తప్పనిసరి అయ్యిందని పేర్కొన్నారు. హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో అందుబాటులోకి తెచ్చిన ఆధార్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ డీఈ దొర వెంకటేశ్వర్లు, ఎస్ డీఈ ఎం జనార్ధన్, తిరుమల్, జేటీవో నరేశ్, జేఈఈ వెంకటేశ్వర్లు, కూస రామచంద్రం, ముష్టం విజయ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

WANTED

jobs Apply Now!

★కరీంనగర్ జిల్లా సిర్పూర్‌లో పని చేయడానికి Ex Service Men సెక్యూరిటీ సిబ్బంది కావలెను. నెలకు జీతం: 22,000/– నుండి 35,000/– వరకు, వయస్సు: 50 సం॥లోపు. Trained సెక్యూరిటీ సిబ్బంది కావలెను. నెలకు జీతం: 19,000/– నుండి 26,000/– వరకు, అర్హత: 10వ తరగతి నుండి డిగ్రీ వరకు. బ్యాచిలర్ వసతి కలదు. వయస్సు: 20–40 సం॥లోపు. ESI, PF కలదు. హైదరాబాద్‌లో పని చేయడానికి ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. జీతం: 25,000/– + పెట్రోల్. సెల్ నెం: 8341038715 / 9848328701 / 8919606707.
NT-98210

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All

CHANGE OF NAME

★I, PEDDIREDDY SUNITHA, R/1-100/1, Kummaripalli, Raikal Mandal, Jagityal Dist., TS. Henceforth shall be known as ADLA LAVANYA, W/o. Adla Suresh.
NT-326237

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వేములవాడ టౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీలు కడుతున్న మంత్రి సీతక్క, ఆయన సోదరి లీల

వేములవాడ టౌన్: సోదరుడు మహేశ్‌కు రాఖీకడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

కలెక్టరేట్: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు రాఖీ కట్టి జ్ఞాపిక అందజేస్తున్న బ్రహ్మకుమారీస్

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

- జిల్లా వ్యాప్తంగా రాఖీపౌర్ణమి వేడుకలు
- సోదరులకు రాఖీలు కట్టిన అక్కాచెల్లెళ్లు

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్పీ అఖిల్ మహాజన్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు

వేములవాడటౌన్/ వేములవాడరూరల్/ చందుర్తి/ కోనరావుపేట/ రుద్రంగి/ ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/వీర్నపల్లి, ఆగస్టు 19: రాఖీపౌర్ణమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరుపుకొన్నారు. వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆయన సోదరి లీల, హైదరాబాద్‌లో మంత్రి సీతక్క రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. చందుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందికి విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కోనరావుపేట, మండల వ్యాప్తంగా రాఖీ వేడుకలను జరుపుకొన్నారు. రుద్రంగి మండలంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాంకు తన కూతురు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఎస్ఐ కదిరె శ్రీకాంత్‌గౌడ్, సిబ్బందికి విద్యార్థినులు రాఖీలు కట్టారు. అలాగే ఎల్లారెడ్డిపేటలోని డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు మహిళా సిబ్బంది రాఖీలు కట్టగా, వృద్ధులు సంబురపడ్డారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతికి, ముస్తాబాద్‌లో ఎస్ఐ గణేశ్, వీర్నపల్లిలో ఎస్ఐ ఎల్లాగౌడ్‌కు విద్యార్థినులు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా గంభీరావుపేట మండల కేంద్రంలో ఎండీ హమీద్‌కు సోదరభావంతో జ్యోతి కొన్నేండ్లుగా రాఖీ కడుతూ హిందూ ముస్లింల మధ్య సోదరభావాన్ని చాటారు.

భావోద్వేగానికి గురైన ఎస్పీ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు19: 'మాది ఉమ్మడి కుటుంబం.. నాకు తొమ్మిది మంది అక్కాచెల్లెళ్లు ఉన్నా.. రాఖీ కట్టడానికి ఈ రోజు వారు దగ్గర లేరు.. వాళ్ల స్థానంలో రాఖీ కట్టిన మీ అందరికీ రక్షణగా ఉంటానని ఎస్పీ అఖిల్‌మహాజన్ భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం ఆయన తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎస్పీకి రాఖీ కట్టారు. తర్వాత ఎస్పీ మాట్లాడుతూ, పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లలేదని బాధపడొద్దని, తాను పోలీస్ అధికారి స్థాయిలో రాలేదని, మీ అందరికీ అన్నగా వచ్చానని తెలిపారు. ప్రతిఒక్కరూ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఆపద సమయాల్లో డయల్ 100 లేదా జిల్లా షీ టీం నం బర్‌కి (8712656425) కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు బ్రహ్మకుమారీస్‌ల శుభాకాంక్షలు

కలెక్టరేట్, ఆగస్టు 19: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు బ్రహ్మకుమారీస్ రాఖీలు కట్టారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బ్రహ్మకుమారీస్ సుకన్య, సువర్ణలలిత ఉన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్

వేములవాడ, ఆగస్టు 19: పట్టణంలోని మూలవాగు వంతెన వద్దకు ఒక్కసారిగా వాహనాలు భారీగా తరలిరావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సోమవారం రక్షాబంధన్ సందర్భంగా వాహనాలు భారీగా రావడంతో అమరవీరుల స్తూపం నుంచి మొదలుకొని ఏరియా దవాఖాన వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు కిలోమీటర్‌కు పైగా నిలిచిపోయిన వాహనాలను పట్టణ సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ రెండు గంటలపాటు శ్రమించి ట్రాఫిక్‌ను సర్దుబాటు చేశారు.

చెట్లకు రాఖీలు కట్టిన బ్లెస్సీ

కోనరావుపేట, ఆగస్టు 19 : చెట్లపై ఉన్న ప్రేమతో రాఖీలు కట్టి పర్యావరణహితాన్ని చాటింది సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ. తానే స్వయంగా రెండు రోజుల పాటు శ్రమించి కాగితాలతో సుమారు వంద రాఖీలను తయారు చేసి, రక్షా బంధన్ వేళ తన అనుబంధాన్ని చాటుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రకాశ్ కూతురు బ్లెస్సీ ఐదేళ్లుగా చెట్లకు రాఖీలు కడుతున్నది. తానే స్వయంగా తయారు రాఖీలు తయారు చేసి, ఇంటి ఆవరణలో తాను నాటిన, హరితహారం మొక్కలకు రాఖీలు కడుతూ ప్రేమను చాటుతున్నది. అన్నాదమ్ముళ్లకు రాఖీ కట్టి తన బంధాన్ని తెలపడంతోపాటు మానవాళికి నిండు నూరేళ్లు ప్రాణవాయువును ఇచ్చే చెట్లకు కూడా రాఖీలు కట్టాలని ఆమె కోరుతున్నది. బ్లెస్సీ చేస్తున్న కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు.

అనుబంధాలకు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి తమ ప్రేమను చాటుకున్నారు. రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లకు సోదరులు కట్నకానుకలు బహూకరించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు సోదరీమణులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: డే కేర్ సెంటర్‌లో రాఖీ కడుతున్న సిబ్బంది

వేములవాడ రూరల్: మర్రిపల్లి కస్తూర్బా పాఠశాలలో సీఐ, ఎస్ఐకి రాఖీ కడుతున్న విద్యార్థిని

కోనరావుపేట: చెట్లకు రాఖీలు కడుతున్న ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ

గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

వేములవాడ రూరల్, ఆగస్టు 19: పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లో గల మానాల తెలంగాణ గిరిజన సంక్షేమ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ప్రతిభ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతిలో 26, ఆరో తరగతిలో 15 సీట్లు, ఏడో తరగతిలో 2, ఎనిమిదో వ తరగతిలో 10 సీట్లు, తొమ్మిదో తరగతిలో 20సీట్లు మిగిలిపోయినట్టు తెలిపారు. ఈ సీట్ల కోసం ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 19: నలుగురు డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఈనెల 18న రాత్రి తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు జిల్లెల్ల గ్రామంలో డీజేలు పెట్టి ప్రజల ఆరోగ్యానికి హానీ కలిగించేలా పెద్ద శబ్దాలతో ఉన్న మూడు సౌండ్ సిస్టమ్‌లను సీజ్ చేశామన్నారు. అదే విధంగా తంగళ్లపల్లిలోని బాబాజీ కాలనీలో డీజేలు పెట్టి రాకపోకలకు అంతరాయం కలిగించిన నలుగురి నిర్వాహకులు పొలాడి నవీన్, కోడం పృథ్వీ, సాయికుమార్, కోడం ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. అనమతులు లేకుండా డీజేలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాడు తల్లి.. నేడు తండ్రి

- ఉరేసుకుని ఆత్మహత్య
- తిమ్మాపూర్‌లో విషాదం

రామచంద్రం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 19: ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాలుగేండ్ల క్రితం తల్లి, నేడు తండ్రి ఆత్మహత్య చేసుకోగా.. వారి పిల్లలు అనాథలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. తిమ్మాపూర్‌కు చెందిన బీమరి రామచంద్రం–మమత దంపతులకు ఇద్దరు కూతుళ్లు కావ్య, శైలు, కుమారుడు అభిషేక్ ఉన్నారు. రామచంద్రం గతంలో అప్పులు చేసి బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో నాలుగేండ్ల క్రితం మమత మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నది. దుబాయ్ నుంచి వచ్చిన రామచంద్రం(40) భార్య లేకపోవడం, కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇబ్బందిపడ్డాడు. అప్పులు తీర్చేమార్గం లేక ఆదివారం రాత్రి తిమ్మాపూర్ హైస్కూల్ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో తమకు దిక్కేవరంటూ ఆ చిన్నారులు బోరున విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనరావుపేట: స్వామివారిని ఊరేగిస్తున్న పద్మశాలీ కులస్తులు

సిరిసిల్లలో రథంపై ఊరేగుతున్న శ్రీ మార్కండేయస్వామివారు

ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు

- నేత్రపర్వంగా మార్కండేయుడి శోభాయాత్ర

శోభాయాత్రలో పద్మశాలీ సంఘ ప్రతినిధులతో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలో నూలు పౌర్ణమి వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా జరిగాయి. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం తొలగి, నేతన్నలు సంక్షేమం వైపు అడుగులు వేయాలన్న సంకల్పంతో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన ఆదివారంతో ముగియగా, సోమవారం నూలు పౌర్ణమి వేడుకలు జరుపుకొన్నారు. స్థానిక మార్కండేయ ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. యజ్ఞోప వీతధారణం, యాగాలు వివిధ పూజలు చేశారు. సాయంత్రం శోభాయమానంగా అలంకరించిన రథాలపై శివభక్త మార్కండేయుడి శోభాయాత్ర నిర్వహించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, నేతన్న చౌక్, మెయిన్ బజార్, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తిరిగి మార్కండేయుడి దేవస్థానం వరకు శోభాయాత్ర సాగింది. మహిళల కోలాటాలు, డప్పుచప్పుళ్లతో జై మార్కండేయ.. జైజై మార్కండేయ.. అనే నామస్మరణతో సిరిసిల్ల పట్టణం మార్మోగింది. శోభాయాత్రలో తయారు చేసిన వస్త్రాన్ని మార్కండేయునికి సమర్పించారు. ఇక్కడ పద్మశాలీ సంఘం నేతలు జిందం చక్రపాణి, గోలి వెంకటరమణ, ఆడెపు రవీందర్, గాజుల బాలయ్య, మండల సత్యం, బొల్లి రామ్మోహన్, కట్టెకోల లక్ష్మీనారాయణ, గూడూరి ప్రవీణ్, గుండ్లపల్లి పూర్ణచందర్, మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కామునూ వనిత, గుజ్జె తార, దార్నం అరుణ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 19: తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు పద్మనగర్‌లో ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు జరుపుకొన్నారు. నూతన జంజిరాలు ధరించి సాయంత్రం వేళలో చేనేత మగ్గంతో శోభాయాత్ర నిర్వహించారు. ఇక్కడ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, పద్మనగర్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్, నాయకులు మోర శ్రీహరి, మచ్చ ఆంజనేయులు, సామల రమేశ్, మచ్చ శ్రీనివాస్, అంకారపు మహేశ్, బండి జగన్, మచ్చ రామకృష్ణ, యాదగిరి, తుమ్మ దేవేందర్, మోర రాజు, మ్యాన శంకర్, భాస్కర్, శ్రీనివాస్ ఉన్నారు.

కోనరావుపేట, ఆగస్టు 19: మండల కేంద్రంతోపాటు నిమ్మపల్లిలో పద్మశాలీ సంఘం అధ్వర్యంలో మార్కండేయ స్వామి శోభాయాత్రను నిర్వహించారు. మహిళలు స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.

ముస్తాబాద్/రుద్రంగి, ఆగస్టు19: ముస్తాబాద్‌లోని మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణ మి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రాసన్న నిర్వహించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు తడక బాలకిషన్, సంఘం ప్రతినిధులు గౌడ కృష్ణహరి, శ్రీరామ్, మనోహర్, దొంత బాల్‌రాజు, ఎనగందుల శంకరు, దశరథం, తడుక ప్రభాకర్, గౌడ సహదేవ్, తాటిపాముల లక్ష్మీనారాయణ, ఉన్నారు. అలాగే రుద్రంగిలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మార్కండేయుడికి ప్రత్యేక పూజలు చేశారు.

సిరిసిల్ల రూరల్: శోభాయాత్రలో పద్మశాలీ సంఘ సభ్యులు

రుద్రంగి: మార్కండేయుడికి పూజలు చేస్తున్న సంఘం సభ్యులు

మధుర జ్ఞాపకం.. ఛాయాచిత్రం

చందుర్తి: కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు

వేములవాడ, ఆగస్టు 19: ఎప్పటికీ నిలిచిపోయే మధుర జ్ఞాపకం ఛాయాచిత్రమైనదని వేములవాడ రూరల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు బొమ్మెన శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా సోమవారం పట్టణంలోని తెలంగాణచౌక్‌లో వారు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఇక్కడ రూరల్ మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రధాన కార్యదర్శి నరేశ్, సభ్యులు గోవర్ధన్, అంజి, సుధాకర్, వేణు, నాగరాజు, విజయ్, శ్రీకాంత్ న్నారు.

చందుర్తి, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ చౌక్ వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు గొట్టె ప్రభాకర్, పులి సత్యం, బత్తుల కమలాకర్, మోతె రాములు, మండలాధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి తాటికొండ నరేశ్, కోశాధికారి ఉదయ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి మహిపాల్, సంఘ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా రుగ్వేద, యజుర్వేద ఉపాకర్మ

వేములవాడ టౌన్, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం రాజన్న ఆలయ అద్దాలమండపంలో రుగ్వేద బ్రాహ్మణులు, నాగిరెడ్డి మండపంలో యజుర్వేద బ్రాహ్మణులు ఆలయ ప్రధాన అర్చకులు నమిలకొండ ఉమేశ్, ఈశ్వరగారి సురేశ్, చంద్రగిరి శరత్, ప్రతాప శ్రీనివాస్, అర్చకుల ఆధ్వర్యంలో ఉపాకర్మలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు అర్చకుల వేదమంత్రాలతో మార్మోగాయి. ఇక్కడ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, గర్శకుర్తి వెంకన్న, మెట్టు రవీందర్, సంకెపల్లి నాగేంద్రశర్మ, ప్రతాప చంద్రమౌళి, బుడెంగారి మహేశ్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ, ఆగస్టు 19: సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని సెస్ ఏఈ సిద్ధార్థ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు